
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

అల్లూరి సీతారామరాజు
జిల్లా వార్తలు
బుధవారం 24 జూలై 2024

నేడు విద్యాలయాలకు సెలవు

పాడేరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరదల తీవ్రత కొనసాగుతుండడంతో బుధవారం కూడా విద్యాలయాలకు సెలవును పొడిగిస్తూ జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ మంగళవారం రాత్రి అత్యవసర ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యాలయాలకు సెలవులు ప్రకటించారు. అలాగే వరదల నేపథ్యంలో ప్రజలు గెడ్డలు, వాగులు దాటవద్దని, సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని ఆయన కోరారు.

వదలని వాన!

ఈదురు గాలులతో కూడిన వర్షం

- తగ్గని గెడ్డల ఉధృతి
- కొనసాగుతున్న వరద బీభత్సం
- ముంపు ప్రాంతాల్లోనే కలెక్టర్, అధికార యంత్రాంగం


హుకుంపేట మండలం మత్స్యగుండంలో ఉరకలేస్తున్న వరదనీరు


పెదబయలు మండలం కెందుగూడ వద్ద వరదకు కొట్టుకుపోయిన నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డు

పాడేరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాను వర్షాలు వదలడం లేదు. సోమవారం సాయంత్రం నుంచే వాయుగుండం ప్రభావం అధికం కావడంతో ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తున్నది. ఇన్నాళ్లు కేవలం వర్షం మాత్రమే కురవడం పెద్దగా ఆందోళన చెందని జనం వర్షానికి ఈదురుగాలులు తోడు కావడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. భారీగా ఈదురుగాలులు వీస్తుండడంతో తీగలు తెగి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నది. అలాగే పాడేరు ఘాట్‌లో, పట్టణంలో సైతం చెట్లు కూలిన ఘటనలు చోటుచేసుకున్నాయి. మండలంలో కిండంగి పంచాయతీ నక్కలపుట్టులో విద్యుత్ తీగ తెగిపడిన ఘటనలో ఒక పాడి ఆవు మృతి చెందింది.

తగ్గని గెడ్డల ఉధృతి

వర్షాలు కొనసాగుతుండడంతో గెడ్డ, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో పాడేరు మండలంలోని మత్స్యగెడ్డ, రాయిగెడ్డ, చిలకలమామిడి గెడ్డ, పాడేరు, పెదబయలు మండలాలకు సరిహద్దున ఉన్న పరదానిపుట్టు గెడ్డ, జి.మాడుగుల మండలంలోని కోడిమామిడి గెడ్డ ... మిగతా 6వ పేజీలో

చింతపల్లి, సీలేరు రోడ్లపై కూలిన భారీ వృక్షాలు

- నిలిచిపోయిన వాహనాలు


కొలపరి వద్ద కూలిన భారీ టేకు చెట్టు

చింతపల్లి, జూలై 23: లంబసింగి-చింతపల్లి జాతీయ రహదారిపై కొలపరి వద్ద మంగళవారం భారీ వృక్షం పడింది. దీంతో గంట పాటు ఇరువైపులా రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో చింతపల్లి పోలీసులు, జాతీయ రహదారి అధికారులు వెంటనే స్పందించి వృక్షాన్ని తొలగించారు. దీంతో రాకపోకలు కొనసాగాయి.

వర్తుండపాడు వద్ద మరో చెట్టు

సీలేరు: జీకేవీధి మండలం ధారకొండ నుంచి గుమ్మిరేవుల ప్రధాన రహదారిలో వర్తుండపాడు వద్ద మంగళవారం భారీ వృక్షం పడిపోయింది. దీంతో ధారకొండ నుంచి తూర్పుగోదావరి రాజమండ్రి, మారేడిమిల్లి, వై.రామవరం తదితర ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

ముంపు ప్రాంతాల ప్రజలు ధైర్యంగా ఉండండి

కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్

- కొనసాగుతున్న సహాయక చర్యలు
- చింతూరు కంట్రోల్ రూమ్ నుంచి కలెక్టర్ సమీక్ష


నీటి మునిగిన ఏటపాక- కూనవరం మార్గాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చింతూరు డివిజన్ పరిధిలోని ముంపు ప్రాంతాల్లోని ప్రజలు ధైర్యంగా ఉండాలని, ఎటువంటి ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ సూచించారు. మంగళవారం ఏటపాక నోడల్ అధికారి, ఐటీడీఏ పీవో అభిషేక్‌తో కలిసి మంగళవారం ఆయన ఏటపాక ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ముంపు ప్రాంతాల్లోని ప్రజలకు అందిస్తున్న సేవలపై అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ.. అవసరం మేరకు పునరావాస కేంద్రాలకు బాధితులను తరలించామన్నారు. అలాగే బియ్యం, కంది పప్పు, కూరగాయలు పం పిణీ చేశామన్నారు. అనంతరం వరద నీట మునిగిన ఏటపాక-కూనవరం మార్గాన్ని ఆయన పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలోని బాధితులతో కలెక్టర్ మాట్లాడి, సహాయక చర్యలపై ఆరా తీశారు. తర్వాత చింతూరు ఐటీడీఏ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సహాయక ... మిగతా 6వ పేజీలో

పొలాల్లో నీటిని తొలగించుకోవాలి

- ఆర్ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త బయ్యపురెడ్డి


లోతుగెడ్డలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

చింతపల్లి, జూలై 23: పంటల సంరక్షణకు పొలాల్లో నిల్వ నీటిని రైతులు తొలగించుకోవాలని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బయ్యపురెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోనిఇ అన్నవరం, కుడుముసారి, లోతుగెడ్డ పంచాయతీల్లో శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా వర్షాల వల్ల పంటలకు కలిగిన నష్టాన్ని గుర్తించి, రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం బయ్యపురెడ్డి మాట్లాడుతూ పొలాల్లో నీరు నిల్వ ఉండడం వల్ల పంట కుళ్లిపోయే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల పొలాల్లో నీటిని బయటకు పంపించాలని సూచించారు. వరి ... మిగతా 6వ పేజీలో

సీలేరు నదిలో యువకుడి గల్లంతు

- చేపల వేటకు వెళ్లి జారి పడి కొట్టుకుపోయిన వైనం


కిల్లో బాబూరావు (ఫైల్)

సీలేరు, జూలై 23 : జీకేవీధి మండలం సీలేరుకు చెందిన కిల్ల బాబూరావు (40) జలవిద్యుత్ కేంద్రం వెనుక నూకాలమ్మ ఆలయం సమీపంలో చేపల వేటకు వెళ్లి గల్లంత య్యాడు. సీలేరు జలవిద్యుత్ కేంద్రం వెనుక భాగంలో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసిన సమయంలో నీటి ప్రవాహం తక్కువగా ఉంటుంది. ఆ సమయంలో ఇక్కడ చాలామంది చేపలు పడుతుంటారు. వర్షాకాలంలో చేపల అధికంగా దొరుకు తుండడంతో సీలేరు కన్నబ్బాయి క్యాంప్‌కు చెందిన కిల్లో బాబూరావు సోమవారం సాయంత్రం అక్కడకు చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు రాళ్ల పైనుంచి జారి నదిలో పడి గల్లంతయ్యాడు. ఆ సమయంలో చూసిన వారు వెంటనే సమాచారం ఇవ్వడంతో బంధువులు వచ్చి ఎంత వెతికిన బాబూరావు ఆచూకీ తెలియలేదు. దీంతో మగళవారం సీలేరు ఎస్ఐ రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

అభివృద్ధికి ఊతం

ఉత్తరాంధ్ర వెనుకబడిన ప్రాంతంగా గుర్తించి ప్రత్యేక సాయం

- మౌలిక వసతుల మెరుగుకు అవకాశం
- ముద్ర రుణాల పెంపు ద్వారా ఎంఎస్ఎంఈలకు చేయూత
- పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ
- మహిళలకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ
- పోలవరం పూర్తితో సాగు, తాగునీరు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
కేంద్రం బడ్జెట్ విశాఖ జిల్లాకు కొంత వరకూ మేలు చేసేదిగా ఉంది. రాష్ట్ర పునర్నిర్మాణ చట్టంలో అమలు చేయకుండా వదిలేసిన వాటిని పూర్తిచేయడానికి ఎన్డీఏ ప్రభుత్వం ఈసారి ప్రాధాన్యం ఇచ్చింది. ఉత్తరాంధ్రను వెనుకబడిన ప్రాంతంగా గుర్తించి ప్రత్యేక సాయం చేస్తామని కేంద్ర మంత్రి ప్రకటించారు. గత ఐదేళ్లు ఈ సాయం అందలేదు. అంతకు ముందు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం వల్ల నిధులు ఆగిపోయాయి. ఇప్పుడు వాటిని ఇవ్వనున్నారు. దీనివల్ల మౌలిక వసతులు మెరుగుపడడమే కాకుండా పరిశ్రమల ఏర్పాటుకు రాయితీలు లభిస్తాయి. యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.


ఎంఎస్ఎంఈలకు ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. ముద్ర రుణాల కింద ఇప్పటివరకూ ఇస్తున్న రూ.10 లక్షల రుణాన్ని రూ.20 లక్షలకు పెంచుతున్నట్టు ప్రకటించారు. కొత్తగా ఉపాధి కల్పించే సంస్థలకు ఒక్కో ఉద్యోగికి నెల జీతం రాయితీ ఇస్తామని భరోసా కల్పించారు. దేశంలో వేయి పారిశ్రామిక శిక్షణ సంస్థలను ఆధునీకీకరించి, పరిశ్రమలకు ఉపయోగపడేలా యువతకు శిక్షణ ఇస్తామని ప్రకటించారు. అందులో విశాఖ జిల్లాకు కూడా అవకాశం లభించనుంది. ఇక్కడి పరిశ్రమలకు అవసరమైన శిక్షణ ఇవ్వడంతో యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

- పరిశ్రమల్లో మహిళలకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలని నిర్ణయించారు. దీనివల్ల పారిశ్రామిక సంస్థల్లో మహిళల సంఖ్య పెరగనుంది.

వానొస్తే వణుకే!

ప్రమాదభరితంగా ఘాట్ మార్గాలు

- వర్షాలు కురిస్తే కూలుతున్న చెట్లు
- విరిగిపడుతున్న కొండ చరియలు
- వాహనాలపై పడితే ఊహించలేని ఘోరం
- అందుకే రాత్రేళ్లు వాహనాల రాకపోకలు నిషేధం
- శాశ్వత ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని ప్రయాణికుల వేడుకోలు


రోడ్డుకు ఇరువైపులా ఏపుగా చెట్లతో పాడేరు ఘాట్ మార్గం

(పాడేరు-ఆంధ్రజ్యోతి)
ఒక మోస్తరు వర్షం కురిసినా పాడేరు ఘాట్ మార్గంలో అక్కడక్కడ చెటు కూలడం, కొండ చరియలు విరిగి పడడం వంటివి జరుగుతుండడంతో ప్రయాణికులు, వాహన చోదకులు భయాందోళనచెందుతున్నారు. సుమారు 15 రోజులుగా ఏజెన్సీలో వర్షాలు కొనసాగుతుండగా గత ఐదు రోజులుగా అల్పపీడనం, వాయుగుండం ప్రభావంతో ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఘాట్ ప్రయాణం ప్రమాదకరంగా మారింది. గత నాలుగు రోజుల్లోనే స్థానిక ఘాట్‌లో అనేక చోట్ల చెట్లు కూలిపోయాయి. అలాగే కొండచరియల నుంచి మట్టి జారిపడుతున్నది. అందుకే ముందు జాగ్రత్త చర్యగా రాత్రుళ్లు ఘాట్‌లో రాకపోకలను అధికారులు నిషేధించారు.

సమస్యంతా పది కిలోమీటర్ల పరిధిలోనే..

ఘాట్ సుమారు 25 కిలోమీటర్లు ఉండగా.. కేవలం పది కిలోమీటర్ల పరిధిలోని చెట్లు కూలడం, కొండ చరియలు విరిగిపడడం వంటివి జరుగుతున్నాయి. ప్రధానంగా అమ్మవారి పాదాలు ప్రాంతం నుంచి వంట్లమామిడి గ్రామం వరకు ఉన్న సుమారు పది కిలోమీటర్ల ఘాట్ మార్గంలోనే ఈ పరిస్థితులున్నాయి. గత మూడేళ్లలో ఘాట్‌లో వ్యూపాయింట్, రాజాపురం సమీప ప్రాంతాల్లో కొండ చరియలు విరిగిపడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. చెట్లు విరిగిపడి రోడ్డుకడ్డంగా పడుతున్న సంఘటనలైతే కోకొల్లలు. అలాగే వ్యూపాయింట్‌కు సమీపంలో ఉన్న రెండు మలుపులు వద్ద భారీ వర్షం కురిస్తే.. వరద నీరు నిల్వ ఉండడంతో పాటు అక్కడి కొండ నుంచి కిందికి మట్టి వచ్చి పడుతున్నది. దీంతో ఆ సమయంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనాల డ్రైవర్లు అంటున్నారు. అలాగే ఘాట్‌లో రాజాపురం సమీపంలోనే ఈ సమస్య అధికంగా ఉంది. రాజాపురం గ్రామానికి అటు, ఇటు సుమారు కిలోమీటరున్నర దూరంలో ఉన్న పెద్ద కొండ ప్రాంతం నుంచి మట్టి పెళ్లలు విరిగిపడి రోడ్డుపైకి వస్తుంటాయి. దీంతో భారీ వర్షం కురిస్తే ఆ ప్రాంతానికి వచ్చేసరికి డ్రైవర్ చాలా అప్రమత్తంగా ఉంటారు. అలాగే గతంలో రాజాపురం వద్ద కొండచరియ విరిగిపడిన ప్రదేశం సైతం ప్రస్తుతం ప్రమాదకరంగానే ఉంది. అలాగే పాడేరు నుంచి మైదాన ప్రాంతాలకు వెళ్లే క్రమంలో రాజాపురం దాటిన తర్వాత ఉన్న కాఫీ తోటల నుంచి వర్షానికి మట్టి రోడ్డుపైకి కొట్టుకు వస్తుంది. ఘాట్‌లో కేవలం పది కిలోమీటర్ల పరిధిలోని ఈ సమస్య ఉంది. అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తే పరిష్కారం లభిస్తుందనే వాదన బలంగా వినిపిస్తున్నది.

రోడ్డుకడ్డంగా కూలుతున్న చెట్లు

ఇటీవల కాలంలో ఘాట్‌లో చెట్లు కూలడం అధికమైంది. ఈ వారం రోజుల్లోనే మినుములూరుకు సమీపంలో రెండు చోట్ల, అమ్మవారి పాదాలకు చేరువలో, వ్యూపాయింగ్, రాజాపురం- డైమండ్‌మార్క్ మధ్యలోని అనేకచోట్ల, వంట్లమామిడికి సమీపంలో చెట్లు కూలాయి. ఆయా చోట్ల చెట్లు కూలడం, విషయం తెలుసుకుని రోడ్ల, భవనాల సిబ్బంది, పోలీసులు వెళ్లి రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లను తొలగించడం వంటివి చేపడుతున్నారు. అయితే వర్షం కురిస్తే ఏ క్షణంలో ఎటువంటి సమస్య వస్తుందోననే ఆందోళన అటు ప్రయాణికుల్లో, ఇటు అధికార యంత్రాంగంలో నెలకొంటున్నది. ఇకనైనా ఘాట్‌లో చెట్లు, కొండచరియల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అందుకే రాత్రుళ్లు వాహనాల రాకపోకలు నిషేధం

వర్షాలు కొనసాగే పరిస్థితులున్న సందర్భాల్లో ఘాట్ మార్గంలోని రాకపోకలు సాగించే వాహనాలకు ఎటువంటి ప్రమాదాలు జరగకూడదనే ఆలోచనతోనే అధికార యంత్రాంగం ... మిగతా 6వ పేజీలో


ఘాట్‌లో వ్యూపాయింట్‌కు సమీపంలో మలుపు వద్ద రోడ్డుపై పడుతున్న మట్టిపెళ్లలు

భమిడికలొద్ది లేటరైట్ క్వారీలో వాటాలు విక్రయం!

వైసీపీ నేతలకు తెలియకుండా అమ్మేసిన బ్రోకర్

- ప్రస్తుతం అజ్ఞాతంలో...
- నలుగురి వద్ద రూ.2.5 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకూ వసూలు
- కూటమి నేతను ఆశ్రయించిన వాటాల కొనుగోలుదారులు


సుందరకోట పంచాయతీ భమిడికలొద్ది దగ్గర గతంలో లేట్‌రైట్ తవ్వకాలు జరిగిన ప్రదేశం

విశాఖపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా నాతవరం మండలం సుందరకోట పంచాయతీలోని భమిడికలొద్ది లేటరైట్ క్వారీ వ్యవహారాలు చూసిన దళారీ ఎన్నికల ముందు ముగ్గురి నుంచి నలుగురికి వాటాలు విక్రయించినట్టు తెలిసింది. అందుకోసం ఒక్కొక్కరి నుంచి మూడు నుంచి నాలుగు కోట్ల రూపాయల వరకూ వసూలు చేసినట్టు సమాచారం.

సుందరకోట పంచాయతీ భమిడికలొద్దిలో 121 హెక్టార్లలో లేటరైట్ తవ్వకాలకు కొయ్యూరు మండలానికి చెందిన జర్తా లక్ష్మణరావుకు అనుమతి ఇచ్చారు. లక్ష్మణరావు వెనుక వైసీపీ కీలక నేతలు ఉండడంతో భమిడికలొద్ది ప్రాంతంలో ప్రైవేటు సైన్యం ఏర్పాటుచేసుకుని లక్షల క్యూబిక్ మీటర్ల లేటరైట్ తవ్వి తీసుకుపోయారు. అయితే క్వారీ ప్రాంతంపై, రవాణా కోసం భమిడికలొద్ది నుంచి సరిహద్దులో ఉన్న తూర్పుగోదావరి జిల్లా రౌతులపూడి మండలం జల్దాం వరకు నిర్మించిన రహదారిపై వివాదం చెలరేగింది. మైనింగ్, రహదారి కోసం చెట్లు కొట్టేయడం వల్ల పర్యావరణానికి, వన్యప్రాణులకు విఘాతం కలుగుతుందని పేర్కొంటూ నాతవరం మండలానికి చెందిన మరిడయ్య ఎన్జీటీలో ఫిర్యాదు చేయడంతో గడచిన ఏడాదిన్నర నుంచి లేటరైట్ తవ్వకాలు నిలిచిపోయాయి. కాగా వైసీపీ పెద్దల తరపున స్థానికంగా వ్యవహారాలు నడిపిన ఓ వ్యక్తి తన అవసరాలు, విలాసాల కోసం భారీగా అప్పులు చేసేశాడు. ఆ అప్పులు ... మిగతా 6వ పేజీలో

జీసీసీ ఎండీగా కల్పనాకుమారి బాధ్యతల స్వీకారం

ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని సిబ్బందికి పిలుపు


జీసీసీ నూతన వీసీ అండ్ ఎండీ కల్పనా కుమారి

విశాఖపట్నం, జూలై 23: గిరిజన సహకార సంస్థ (జీసీసీ) వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కల్పనాకుమారి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు అధికారులు, సిబ్బంది సాదరంగా స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలియజేశారు. కల్పనాకుమారి బాధ్యతలు స్వీకరించిన వెంటనే అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అరకు కాఫీ మార్కెటింగ్, తదితర అంశాలపై చర్చించారు. జీసీసీ ప్రధాన కార్యాలయం, క్షేత్రస్థాయి సిబ్బంది అందరూ నిబద్ధతతో పనిచేయాలని, తద్వారా సంస్థ పురోభివృద్ధి చెందుతుందని, గిరిజనులకు మంచి జీవనోపాధి లభిస్తుందని అన్నారు. అనంతరం గిరిజన సహకార సంస్థలో విజిలెన్స్, ఫైనాన్స్, మార్కెటింగ్, రిటైల్ మార్కెటింగ్, కాఫీ, పరిపాలన, అకౌంట్స్, రవాణా విభాగాలను, అరబికా కాఫీషాపు, ట్రైఫెడ్ రిటైల్ అవుట్‌లెట్, పలు అమ్మకం కేంద్రాలను పరిశీలించారు. లాసన్స్‌బే కాలనీలోని జీసీసీకి సంబంధించిన ఖాళీ స్థలాన్ని పరిశీలించి తదుపరి కార్యాచరణకు అధికారులకు సూచనలిచ్చారు.

వైద్య సేవలు అస్తవ్యస్తం



ఏరియా ఆస్పత్రిలో చికిత్స కోసం క్యూలో నిరీక్షిస్తున్న రోగులు

▸▸ పాడేరుకు డిప్యుటేషన్‌పై ముగ్గురు వైద్యులు ▸▸ పనిచేసే వైద్యులపైనే పని భారం ▸▸ ఏరియా ఆస్పత్రిలో రోగులు తప్పని కష్టాలు

చింతపల్లి, జూలై 23: ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు అస్తవ్యస్తంగా కొనసాగుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి ఆస్పత్రికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదు. ఆస్పత్రిలో పనిచేస్తున్న కొంత మంది వైద్యులు తరచూ విధులకు గైర్హాజరవుతున్నప్పటికీ ఉన్నతాధికారులు కనీస చర్యలు తీసుకోవడంలేదు. దీంతో పనిచేసేత వైద్యులపైనే భారం పడుతోంది.

చింతపల్లి ఏరియా ఆస్పత్రికి ప్రతీ రోజు 350 నుంచి 450 మంది రోగులు చికిత్స కోసం వస్తున్నారు. ప్రతీ రోజు 60 మంది ఇన్ పేసెంట్లు ఉంటున్నారు. రోజుకు ఎనిమిదికి పైగా ప్రసవాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో భారీగా వైద్యుల పోస్టులు ఖాళీగా ఉండడం, విధుల్లోనున్న కొంత మంది వైద్యులు విధులకు ఎగనామం పెట్టడం వల్ల రోగులకు పూర్తి స్థాయిలో వైద్యం అందడంలేదు.

జనరల్ సర్జన్ వారానికే ఒక్క రోజే విధులకు

ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న జనరల్ సర్జన్ అజయ్‌బాబు వారానికి ఒక రోజు (మంగళవారం) మాత్రమే విధులకు హాజరవుతున్నారు. మిగిలిన రోజుల్లో ఆయన ఎగనామం పెడుతున్నారని రోగులు, ఆస్పత్రి వైద్య సిబ్బంది తెలిపారు. జనరల్ సర్జన్ వారంలో ఒక్క రోజు మాత్రమే విధులకు హాజరుకావడంపై క్రమంగా విధులకు హాజరయ్యే ఇతర వైద్యులు నిలదీసినప్పటికి ఉన్నతాధికారులు కనీసం పట్టించుకోలేదు. దీంతో జనరల్ సర్జన్ నెలల తరబడి ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారు.

ఇద్దరు వైద్యులు విధులకు డుమ్మా

ఆస్పత్రిలో అత్యంత కీలకమైన పోస్టుల్లో పనిచేస్తున్న ఎనస్తీషియా వైద్యులు విక్రమ్, గౌతం మూడు నెలలుగా విధులకు ఎగనామం పెట్టినట్టు వైద్య సిబ్బంది తెలిపారు. ఎనస్తీషియా వైద్యాధికారి విక్రమ్ చింతపల్లి ఆస్పత్రికి విధులకు హాజరు కావడం లేదని నెల రోజుల క్రితం వైద్య విధాన పరిషత్ అధికారులు కూనవరం ఆస్పత్రికి డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. ప్రస్తుతం ఆయన కూనవరం ఆస్పత్రిలో కూడా విధులకు హాజరుకావడం లేదని సమాచారం. కాగా మరో ఎనస్తీషియా వైద్యాధికారి గౌతం విధులకు హాజరుకావడం లేదు. దీంతో ఎనస్తీషియా వైద్యులు లేక ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు జరగడంలేదు.



వైద్యులు లే(రా)క ఖాళీగా ఉన్న కుర్చీలు

పాడేరుకు డిప్యుటేషన్‌పై ముగ్గురు వైద్యులు

చింతపల్లి ఆస్పత్రికి చెందిన ముగ్గురు వైద్యులు పాడేరు జిల్లా ఆస్పత్రిలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహించడం వల్ల ఆస్పత్రిలో వైద్యుల కొరత అధికంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా జిల్లా కలెక్టర్ అన్ని రకాల డిప్యుటేషన్లు రద్దు చేస్తున్నట్టు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే గైనికాలజిస్టులు శ్రీలత, ప్రవీణ, జనరల్ మెడిసిన్ వైద్యురాలు అశ్విని పైరవీలు చేస్తూ పాడేరు జిల్లా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నాని పలువురు నాయకులు, రోగులు, సిబ్బంది చెబుతున్నారు. జిల్లా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు వైద్యుల డిప్యుటేషన్ రద్దు చేసి చింతపల్లి ఏరియా ఆస్పత్రికి పంపించాలని స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ఉన్నతాధికారులకు విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేకపోతోంది.

సెలవుల్లో పలువురు వైద్యులు

ఆస్పత్రిలో పనిచేస్తున్న గైనికాలజిస్టు సుధాశారద, చిన్నపిల్లల వైద్యాధికారి ప్రభావతి వ్యక్తిగత సెలవులో ఉన్నారు. జనరల్ మెడిసిన్ వైద్యులు రుక్మిణి, లావణ్య ప్రసూతి సెలవుపై వెళ్లారు. పేతాలజిస్టు రమేశ్, జనరల్ మెడిసిన్ వైద్యాధికారి భారతీ మంగళవారం వారంతాపు సెలవులో ఉన్నారు.

కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

ఏరియా ఆస్పత్రిపై వైద్య విధాన పరిషత్ అధికారుల పర్యవేక్షణలేకపోవడం వల్ల సకాలంలో సేవలు అందడంలేదని రోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రసూతి సెలవులో ఇద్దరు వైద్యులు ఉండడం, మరో ముగ్గురు వైద్యులు జిల్లా ఆస్పత్రిలో డిప్యుటేషన్‌పై పనిచేయడం వల్ల వైద్యుల కొరత అధికంగా ఉంది. ఈ సమయంలో ఒకేసారి ఎక్కువ మంది వైద్యులకు సెలవు మంజూరు చేయడం వల్ల విధుల్లో ఉన్న ఒకరిద్దరిపై పనిభారం పెరిగిపోతున్నది. గతంలో వైద్యుల హాజరుపే నాటి కలెక్టర్ సుమిత్ కుమార్ ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షించేవారు. దీంతో వైద్యులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేవారు. ప్రస్తుతం ఈ పరిస్థితి లేక ఇష్టారాజ్యంగా విధులకు ఎగనామం పెడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ఆదివాసీ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



మాట్లాడుతున్న కాఫీ బోర్డు డైరెక్టర్ ఉమామహేశ్వరరావు

గిరిజన కాఫీ రైతులకు సంపూర్ణ సహకారం

▸▸ కాఫీ బోర్డు డైరెక్టర్ కురసా ఉమామహేశ్వరరావు

పాడేరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గిరిజన కాఫీ రైతులకు కేంద్ర కాఫీ బోర్డు నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని కాఫీ బోర్డు డైరెక్టర్ కురసా ఉమామహేశ్వరరావు తెలిపారు. మండలంలో మినుములూరులోని కాఫీ బోర్డు సీనియర్ లైజన్ అధికారి కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాఫీ రైతులకు పూర్తి స్థాయిలో సహకరించేందుకు కాఫీ బోర్డు భారీగా నిధులు వ్యయం చేయనుందన్నారు. పాడేరు ఐటీడీఏ కాఫీ రైతులకు అవసరమైన గోదాములు, డ్రైయింగ్ యార్డుల నిర్మాణానికి రూ.5 కోట్ల వరకు వ్యయం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో కాఫీ బోర్డు ద్వారా రూ.22 కోట్లు వ్యయంతో కాఫీ రైతులకు అవసరమైన ప్రోత్సాహకాలు ఇవ్వడానికి కేంద్రం నిర్ణయించిందన్నారు. ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడిన రైతు సమాఖ్యలకు ప్రోత్సహించి కాఫీ ఆధారిత పరిశ్రమలు, ఉపాధి కల్పనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాఫీ బోర్డు మరో డైరెక్టర్ జైతి ప్రభాకరరావు, కాఫీ బోర్డు ఇన్‌చార్జి డీడీ, సీనియర్ లైజన్ అధికారి రమేశ్, ఐటీడీఏ కాఫీ విభాగం అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, రైతు ఉత్పత్తి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో శతశాతం హాజరు ఉండాలి

▸▸ గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీ కొండలరావు

చింతపల్లి, జూలై 23: ఆశ్రమ పాఠశాలల్లో శతశాతం విద్యార్థుల హాజరు ఉండాలని గిరిజన సంక్షేమ విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఐ.కొండలరావు స్పష్టం చేశారు. మండలంలోని లోతుగెడ్డ, చింతపల్లి బాలురు -2, బాలికలు, జూనియర్ కళాశాల పోస్టుమెట్రిక్ వసతి గృహాన్ని మంగళవారం తనిఖీ చేశారు. వసతి గృహాల్లో సదుపాయాలు, భోజనాలు పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో డీడీ మాట్లాడుతూ పాఠశాల విడిచి వెళ్లిన విద్యార్థులు తిరిగి హాజరుకాకపోతే వెంటనే తల్లిదండ్రులతో మాట్లాడి కారణాలు తెలుసుకోవాలన్నారు. వాతావరణంలో మార్పులతో వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లి మెరుగైన సేవలందించాలన్నారు. పది విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో ఉంటూ ఇంటర్, డిగ్రీ చదవుతున్న విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని డీడీ తెలిపారు. జూనియర్ కళాశాల పోస్టుమెట్రిక్ వసతి గృహంలో విద్యార్థులతో డీడీ సమావేశమయ్యారు. గంజాయి, మద్యం జోలికి వెళితే విలువైన జీవితాలను నాశనం చేసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో జయ నాగలక్ష్మి, హెచ్‌డబ్ల్యూవో పసుపులేటి వినాయకరావు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి

▸▸ జల విద్యుత్ కేంద్రంలోని రెండు, నాలుగు యూనిట్లలో మరమ్మతులు

▸▸ నెలాఖరు నాటికి వినియోగంలోకి అన్ని యూనిట్లు

▸▸ ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు

సీలేరు, జూలై 23: సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో రెండు, నాల్గో నంబర్ల యూనిట్లను ఒకటి, రెండు రోజుల్లో వినియోగంలోకి తీసుకురానున్నట్టు సీలేరు కాంప్లెక్సు ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు తెలిపారు. సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో మూడు యూనిట్లు పడకేశాయని మంగళవారం పత్రికల్లో వచ్చిన వార్తలపై ఆయన స్పందించారు. ఆయా యూనిట్లలో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. అల్పపీడన ప్రభావంతో ఈ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి నాలుగు, రెండవ యూనిట్‌లకు సంబంధించిన బస్‌డెక్ట్ నుంచి వాటర్ చిమ్మి చెమ్మ చేరడంతో స్టాటర్ ఎర్త్ సమస్య తలెత్తిందన్నారు. దీని వలన మెగ్గర్ వ్యాల్యూ పడిపోయి సాంకేతిక లోపాలు తలెత్తాయన్నారు. మెగ్గరు వ్యాల్యు రావడానికి స్టాటర్ హీట్ చేయిస్తున్నామని, దీని కోసం శ్రీశైలం నుంచి హాట్ బ్లోయర్‌ను కూడా తెప్పిస్తున్నామన్నారు. పనులు ఎంత వేగవంతంగా పూర్తి చేయిద్దామన్నా వాతావరణం కూడా పూర్తిగా సహకరించకపోవడం వలన కూడా పనుల్లో కాస్త జాప్యం జరుగుతుందన్నారు. బస్‌డెక్ట్‌లోకి నీరు ప్రవేశించకుండా ఉండేందుకు సివిల్ అధికారులు స్పెషల్ కెమికల్స్‌ను అప్లై చేసినప్పటికీ వాతావరణం అనుకూలించక అది పూర్తిగా డ్రై కావడం లేదన్నారు. మధ్యాహ్నం కాస్త వర్షం తగ్గుముఖం పట్టడంతో ఆ కెమికల్స్‌ను మరలా అప్లయ్ చేశామన్నారు. ఈ రోజు రాత్రి ఏ సమయానికైనా రెండో నంబరు యూనిట్‌ను వినియోగంలోకి తీసుకురావడానికి అన్నివిధాలా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. అలాగే నాల్గవ నంబర్ యూనిట్‌ను కూడా మరో రెండు రోజుల్లో వినియోగంలోకి తీసుకొస్తామని సీఈ వాసుదేవరావు తెలిపారు. అలాగే సీలేరు జల విద్యుత్ కేంద్రంలోని మొదటి యూనిట్ పనులు ఈ నెలఖరులోగా పూర్తి చేసి ఆ యూనిట్‌ను కూడా వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. విలేకర్ల సమావేశంలో ఇన్‌చార్జి ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈలు బాలకృష్ణ, ప్రభాకరరావు, ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

1358.3 అడుగులకు గుంటవాడ జలాశయం: ఎస్ఈ

సీలేరు, జూలై 23: గుంటవాడ జలాశయం నీటి మట్టం మంగళవారం సాయంత్రానికి 1358.2 అడుగుల్లో స్థిరంగా కొనసాగుతుందని సీలేరు కాంప్లెక్సు ఇన్‌చార్జి ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి నుంచి గుంటవాడ జలాశయం ఎగువ ప్రాంతంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పిల్లిగెడ్డ, ఐస్‌గెడ్డ నుంచి గుంటవాడ జలాశయానికి ఇన్‌ఫ్లో తగ్గిందన్నారు. ప్రస్తుతం ఐదు వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తున్నట్టు చెప్పారు. సోమవారం 1057.3 అడుగుల నీటిమట్టం ఉండగా, అది మంగళవారం సాయంత్రానికి 1058.2 అడుగులకు పెరిగిందన్నారు. సీలేరు జల విద్యుత్ కేంద్రంలో గ్రిడ్ అధికారుల ఆదేశాల మేరకు ఒక యూనిట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తిని చేస్తుండడంతో నీటి మట్టం నిలకడగా ఉందన్నారు. జలాశయంలో 1360 అడుగుల నీటిమట్టానికి చేరితేనే విడుదల చేస్తామని చెప్పారు.

వదలని వాన!

... 5వ పేజీ తరువాయి

మత్స్యగెడ్డ, ముంచంగిపుట్టు మండలంలో కుమడ, బూసిపుట్టు, లక్ష్మీపురం, రంగబయలు ప్రాంతాల్లోని గెడ్డలు, డుంబ్రిగుడలోని చాపరాయిగెడ్డ, సంపంగి గెడ్డ, లోచలి గెడ్డ , హుకుంపేట మండలంలో మత్స్యగుండం, చీడిపుట్టు, లివిటి, రాళ్లగెడ్డలు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితులు జన జీవనానికి అంతరాయం మారాయి. అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు, ప్రజల్ని అప్రమత్తం చేయడంతో ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించలేదు.

పాడేరు రూరల్: మంగళవారం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి.



పాడేరు పీఎంఆర్సీ జంక్షన్‌లో విరిగిపడ్డ చెట్టు కొమ్మలు

ఉదయం 6 గంటల సమయంలో ఐటీడీఏ కార్యాలయానికి సమీపంలోని పీఎంఆర్సీ జంక్షన్ వద్ద భారీ చెట్టు కొమ్మ విరిగిపడటంతో రోడ్డుపై వ్యాపారి పండ్ల బండి ధ్వంసమైంది. విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. విషయం తెలుసుకున్న ఆర్‌అండ్‌బీ అధికారులు విరిగిపడ్డ చెట్టుకొమ్మను తొలగించారు. అక్కడికి సమీపంలో మరో భారీ వృక్షం నుంచి కొమ్మ విరిగిపడే ప్రమాదాన్ని గుర్తించిన అధికారులు దగ్గరుండి ఆ కొమ్మను తొలగించారు.

పాత ఆస్పత్రి సమీపంలోని అటవీశాఖ సిబ్బంది నివాస గృహాలకు సమీపంలో ఉన్న చెట్టు కొమ్మ మధ్యాహ్నం 2 గంటల సమయంలో విరిగి అటుగా వెళ్తున్న నీలకంఠానగర్‌కు చెందిన బడగల గుణ అనే యువకుడిపై పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్య సేవలు పొందుతున్నాడు. సాయంత్రం 6 గంటల సమయంలో తలారిసింగి సమీపంలో భారీ వృక్షం నేలకొరగడంతో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. విద్యుత్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని చెట్టును తొలగించి రాత్రి 8 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

పెదబయలు: మండలంలోని రూడకోట నుంచి జామిగూడ మీదుగా



ముంచంగిపుట్టు మండలం బుంగాపుట్టు పంచాయతీ చుట్టుగొంది సమీపంలో కూలిపోయిన కల్వర్టు

ఒడిశా బోర్డర్ వరకు నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డు జామిగూడ, మెట్టగూడ, చకెందుగూడ గ్రామాల కల్వర్టుల వద్ద వరద ఉధృతికి కొట్టుకుపోయింది. మండలంలోని ఎగు బొండాపల్లి, రోగులపేట కూడలి, కంటిమామిడి గ్రామాల్లో ఇళ్లు, దుకాణాలపై చెట్లు పడ్డాయి. దీంతో పెంకులు, గోడలు ధ్వంసం అయ్యాయి.

ముంచంగిపుట్టు: మండలంలోని బుంగాపుట్టు పంచాయతీ చుట్టుగొంది వెళ్లే మార్గంలోని కల్వర్టు కూలిపోయింది. పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వాగులు మత్స్యగెడ్డ పాయకలు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

అరకులోయ: అరకు మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో మంగళవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు ఈదులుగాలులు బీభత్సం సృష్టించాయి. రోజంతా ముసురు వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. మధ్యలో సరఫరా వచ్చినట్లే వచ్చి కొద్ది నిమిషాలకే నిలిచిపోయేది. దీంతో గృహ వినియోగదారులు, వ్యాపారులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

జి.మాడుగుల: మండలంలోని వర్షం తగ్గుముఖం పట్టకపోవడంతో వరద ఉధృతి తగ్గడం లేదు. మంగళవారం మండల కేంద్రంలో సంతబయలు జరిగే వారపు సంత బోసిబోయింది. ఎడతెరిపిలేని వానలకు మండల కేంద్రం చిత్తడిగా మారింది. వరద ఉధృతికి దెబ్బతిన్న పంట పొలాలకు మండల వ్యవసాయ అధికారులు పరిశీలించారు.

ముంపు ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ మకాం

జిల్లాలోని అధిక ముంపు ప్రభావం ఉన్న చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోనే జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ గత ఐదు రోజులుగా మకాం వేశారు. ఆయా ప్రాంతాల్లోని వరద సహాయక, పునరావాస చర్యలను పర్యవేక్షిస్తున్నారు. అలాగే జిల్లాలో వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టే వరకు ఘాట్ మార్గాల్లో రాత్రి వేళల్లో వాహనాల రాకపోకల నిషేధం కొనసాగుతుందని అధికారులు అంటున్నారు. అలాగే జిల్లాలో పాడేరు రెవెన్యూ డివిజన్‌లో గెడ్డలు ఉధృతంగా ప్రవహించడంతో ఆయా ప్రాంత గిరిజనులకు సురక్షితంగా ఇళ్లలోనే ఉండాలని,

జాజులబంద రోడ్డు పూర్తికి చర్యలు

▸▸ వర్షాలు తగ్గగానే పనులు: టీడబ్ల్యూ డీఈ చాణిక్య

కొయ్యూరు, జూలై 23: జాజులబంద రహదారి నిర్మాణం పూర్తి చేయడానికి చర్యలు చేపడుతున్నామని గిరిజన సంక్షేమశాఖ డీఈ చాణిక్య తెలిపారు. ఆదివారం జాజులబంద, పెదగరువు, పిత్రిగడ్డ, నీళ్లబంద, గ్రామాల గిరిజనులు రహదారి నిర్మాణాలను చేపట్టాలని కోరుతూ మోకాళ్లపై నిరసన తెలిపిన విషయం తెలిసిందే. దీనిపై మంగళవారం డీఈ స్పందించారు. ఈ మేరకు 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ 2024 ఫిబ్రవరిలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ఆరున్నర కిలోమీటర్ల రహదారి నిర్మాణాలకు రూ.కోటి మంజూరైందన్నారు. ఈ నిధులతో ఏప్రిల్‌లో పనులు ప్రారంభించామని, మూడు ప్రధాన కల్వర్టుల నిర్మాణాలు పూర్తి చేశామని చెప్పారు. అనంతరం అర్ల గ్రామం నుంచి జాజులబంద వరకు మూడు కిలోమీటర్లు మేర రోడ్డు నిర్మించి గ్రావెల్, జీఎస్‌పీ వేసి రోలింగ్ చేశామన్నారు. మిగిలిన మూడున్నర కిలోమీటర్లు రహదారి నిర్మాణాలకు బండరాళ్లు ఉండడంతో, వాటిని పేల్చి నిర్మాణాలు చేపట్టాల్సి ఉందని చెప్పారు. ఇందుకోసం పోలీసు, ఇతర శాఖల అనుమతులు ఉండాలని వివరించారు. వర్షాలు తగ్గిన వెంటనే నిర్మాణాలు చేపడతామన్నారు. ఈ విషయంలో గిరిజనులను పలు సంఘాల నాయకులు రెచ్చగొట్టడం సరికాదని ఆయన పేర్కొన్నారు. అతని వెంట జేఈ రామకృష్ణ ఉన్నారు.

భమిడికలొద్ది లేటరైట్ క్వారీలో వాటాలు విక్రయం!

... 5వ పేజీ తరువాయి

తీర్చుకోవడంతోపాటు భవిష్యత్తులో సెటిల్ కావాలనే ఉద్దేశంతో ఎన్నికల ముందు వ్యాపారంలో వాటాల విక్రయం పేరుతో పలువురి నుంచి భారీగా డబ్బులు తీసుకున్నాడు. 2024లో వైసీపీ ప్రభుత్వమే తిరిగి అధికారంలోకి వస్తుందని, గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఉన్న వివాదాలు పరిష్కారమై క్వారీయింగ్ మొదలుపెడతామని వారిని నమ్మించాడు. అనపర్తికి సమీపంలో గల రాయవరానికి చెందిన ఒక ఫైనాన్షియర్ (గత ప్రభుత్వంలో కీలక కార్పొరేషన్ చైర్మన్ బినామీ)కు ఒక వాటా అమ్మేసి రెండు నుంచి మూడు కోట్ల రూపాయల వరకు తీసుకున్నాడు. పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం ప్రాంతానికి చెందిన ఒకరి నుంచి, హైదరాబాద్‌లో సినీ నిర్మాణదారుడి నుంచి మూడు, నాలుగు కోట్ల రూపాయల చొప్పున తీసుకున్నాడు. ఇంకా తూర్పుగోదావరి జిల్లాలో మరో వ్యక్తి నుంచి రెండున్నర కోట్లు తీసుకున్నాడు. లీజుదారుడికి తెలియకుండా వ్యాపారంలో వాటాలు అమ్మకాలు జరిపినట్టు ఆలస్యంగా తెలిసింది. ఇదిలావుండగా క్వారీని బినామీ పేరిట తీసుకున్న వైసీపీ కీలక నేతలకు కూడా సమాచారం అందడంతో సంబంధిత వ్యక్తిని పిలిచి గట్టిగా హెచ్చరించినట్టు తెలిసింది. దీంతో అతను అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడని సరుగుడు ప్రాంతంలో లేటరైట్ క్వారీలో పనిచేసినవారు చెబుతున్నారు. ఇదిలావుండగా రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో వైసీపీ పెద్దలు ఈ క్వారీపై మౌనంగా ఉండిపోయారు. భమిడికలొద్ది క్వారీలో వాటాలు కొనుగోలు చేసినవారు తమ వద్ద డబ్బులు తీసుకున్న బ్రోకర్ కోసం అన్వేషిస్తున్నారు. ఈ క్రమంలో వాటాలు కొనుగోలు చేసిన వారిలో ఒకరిద్దరు ప్రస్తుత ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన కలిసి తమ గోడు చెప్పుకున్నారని తెలిసింది.

పంటల నష్టాలపై సర్వే: వ్యవసాయాధికారి శ్రీనివాస్

ముంచంగిపుట్టు, జూలై 23: భారీ వర్షాలకు దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, వేరుశనగ తదితర పంటల నష్టం అంచనా వేసేందుకు సర్వే చేస్తామని వ్యవసాయాధికారి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కించాయిపుట్టు, కరిముఖిపుట్టు పంచాయతీల్లో మంగళవారం శాస్త్రవేత్తల బృందంతో కలిసి ఆయన పర్యటించి పంటలను పరిశీలించారు. ఇప్పటివరకు 25 గ్రామాల్లో 280 హెక్టార్ల మేరకు దెబ్బతిన్న పలు రకాల పంటను గుర్తించామని చెప్పారు. వర్షాలు తగ్గాక పూర్తి స్థాయిలో పంట నష్టాన్ని అంచనా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ప్రదీప్, రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయక సిబ్బంది పాల్గొన్నారు.

వానొస్తే వణుకే!

... 5వ పేజీ తరువాయి

రాత్రి వేళల్లో రాకపోకలను నిషేధిస్తున్నది. వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఘాట్‌లోని కొండప్రాంతాలు పూర్తి నానిపోవడం వల్ల చెట్లు కూలడం లేదా కొండ చరియలు విరిగిపడడం వంటి సంఘటనలు చోటుచేసుకునే అవకాశాలున్నాయి. ఈ తరుణంలో రాత్రి వేళల్లో అనుకోని సంఘటనలు జరిగితే ప్రయాణికులకు ఊహించని నష్టం కలిగే ప్రమాదముంది. దానిని నివారించాలనే లక్ష్యంతోనే జిల్లాలో పాడేరు ఘాట్‌లో పాటు, అరకులోయ, అనంతగిరి, చింతూరు, లంబసింగి, డౌనూరు, ఘాట్ మార్గాల్లో రాత్రుళ్లు రాకపోకలను నిలుపుదల చేశారు.

ఘాట్ మార్గాల్లో అధికారులు ఏమి చేయాలంటే...

- ఘాట్‌లో చెట్లు, కొండచరియల కారణంగా ప్రమాదకరంగా ఉన్న మలుపుల వద్ద బోర్డులు పెట్టాలి.
- కూలేందుకు సిద్ధంగా, ప్రమాదకరంగా ఉన్న చెట్లను తక్షణమే తొలగించాలి.
- గతంలో కొండచరియ విరిగిపడిన ప్రాంతంలో భారీ రిటర్నింగ్ వాల్‌ను లేదా గట్టి ఇనుప కంచెలను ఏర్పాటు చేయాలి.
- ఘాట్‌లో రాజాపురం సమీపంలో ఉన్న కాఫీ తోటల నుంచి మట్టి రోడ్డుపైకి కొట్టుకుని రాకుండా కొండపైనే కందకాలు తవ్వించాలి.
- వర్షం నీరు రోడ్డుపైకి రాకుండా ఘాట్‌కు కొండ వైపున డ్రైన్లు నిర్మించాలి.
- ఘాట్‌లో రోడ్డుపై నుంచి నీరు ప్రవహించకుండా అవసరమైన చోట్ల పైపు కల్వర్టులను నిర్మించాలి.

పొలాల్లో నిల్వ నీటిని తొలగించుకోవాలి

... 5వ పేజీ తరువాయి

నారుమడుల్లో కిలో యూరియా, ఒక లీటరు పొటాష్ కలిపి చల్లాలన్నారు. నారుమడిలో తెగుళ్ల నివారణకు ఒక లీటరు నీటిలో ఒక గ్రాము కార్బెండిజం మందు కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. 15 నుంచి 21 రోజుల వయస్సు కలిగిన నారును వరి మడుల్లో నాటుకోవాలన్నారు. వేరుశనగ పంటలో తిక్క ఆకుమచ్చ తెగులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ఒక లీటరు నీటిలో ఒక గ్రాము కార్బెండిజంగాని, 2.5గ్రాముల మ్యాంకోజెబ్ చొప్పున పంటపైన పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాల హుస్సేన్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల ప్రజలు ధైర్యంగా ఉండండి

... 5వ పేజీ తరువాయి

పునరావాస చర్యలను సమీక్షించారు. చింతూరు, కూనవరం, ఏటపాక, వీఆర్.పురం మండలాల్లోని వరద ముంపు ప్రాంతాల్లో తాజా పరిస్థితులు, అధికార యంత్రాంగం చేపడుతున్న చర్యలపై అక్కడి నుంచే ఆయన టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్, పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు అభిషేక్, సూరజ్ గనోరే, చైతన్య, రంపచోడవరం సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

నేడు జిల్లాలో విద్యాలయాలకు సెలవు

▸▸ జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరదల తీవ్రత కొనసాగుతుండడంతో విద్యాలయాలకు బుధవారం సెలవు పొడిగించినట్టు కలెక్టర్ ఏఎస్.దినేశ్ కుమార్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వరదల ప్రభావం తగ్గకపోగా ఉధృతంగా కొనసాగుతుండడంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా బుధవారం సెలవులు ప్రకటించినట్టు తెలిపారు. అలాగే వరదల నేపథ్యంలో ప్రజలు గెడ్డలు, వాగులు దాటవద్దని, సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని ఆయన సూచించారు.

రాగల ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు

చింతపల్లి, జూలై 23: జిల్లాలో రాగల ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. మంగళవారం వాతావరణ సమాచారాన్ని ప్రకటించారు. ఈ నెల 28వ తేదీ వరకు అరకు, పాడేరు, చింతపల్లి, రంపచోడవరం డివిజన్ పరిధిలో గరిష్ఠంగా 20 మిల్లీమీటర్లు, కనిష్ఠంగా ఐదు మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుందన్నారు. అధిక తేమ, మబ్బులతో కూడిన వాతావరణం కలిగి ఉంటుందని ఆయన చెప్పారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం: ఐసీడీఎస్ పీడీ

పాడేరు రూరల్, జూలై 23: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యకుమారి ఆదేశించారు. మండలంలోని మారుమూల డల్లాపల్లి, గుర్రగరువు పీవీటీజీ గ్రామాల్లోని మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. అనంతరం ప్రీ స్కూల్ హాజరు పట్టికలు, రికార్డులు, హాట్ కుక్కుడ్ మీల్, స్టాక్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారులు అంటు వ్యాధులకు గురికాకుండా సబ్బుతో పరిశుభ్రం చేయాలన్నారు. గుర్రగరువు కేంద్రంలో పౌష్టికాహార నిల్వలు ఎక్కువ ఉండడంతో కార్యకర్తను ప్రశ్నించగా, వర్షాల కారణంగా గర్భిణులు, బాలింతలు టేక్‌హోమ్ రేషన్ (టీహెచ్‌ఆర్) తీసుకొనేందుకు రాలేదని చెప్పారు. లబ్ధిదారులకు వెంటనే వాటిని అందించేలా చర్యలు చేపట్టాలని పీడీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ఝాన్సీరాణి, సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

ఏకలవ్య ప్రిన్సిపాల్‌గా మనోజ్‌కుమార్

చింతపల్లి, జూలై 23: స్థానిక ఏకలవ్య ఆదర్శ నివాసానుబంధ పాఠశాల ప్రిన్సిపాల్‌గా మనోజ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. చండీగఢ్ కేంద్రీయ విద్యాలయంలో పీజీటీ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న అతన్ని కేంద్ర ప్రభుత్వం ఇక్కడికి బదిలీ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆయన విధుల్లో చేరారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా చేసిన అన్నామణిని రంపచోడవరం టీడబ్ల్యూ గురుకుల ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు.

గుర్రగరువులో 40 మందికి వైద్య సేవలు

పాడేరు రూరల్, జూలై 23: మోదాపల్లి పంచాయతీ గుర్రగరువు గ్రామంలో మంగళవారం 40 మందికి వైద్య సేవలు అందించినట్టు వైద్యాధికారి నరసింహరావు తెలిపారు. అలాగే ఇంటింటికీ తిరిగి పరీక్షలు చేయగా ఆరుగురు సాధారణ జ్వరాలతో బాధపడుతున్న గుర్తించి మందులు అందించామని చెప్పారు. వాతావరణంలో మార్పులతో ఎక్కువగా చర్మ వ్యాధులు, జలుబుతో బాధపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎస్.వరహాలనాయుడు, కొండమ్మ, ధనుంజయ్, సోముదొర పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు

చింతపల్లి, జూలై 23: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం గెస్ట్ లెక్చరర్ల నియామకాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కళాశాలలో జువాలజీ, కంప్యూటర్ సైన్స్, ఎకనామిక్స్, కామర్స్ పార్యాంశాలలో ఒక్కొక్క పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు.పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు సాధించిన వారు అర్హులని, సెట్, నెట్, పీహెచ్‌డీ చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు ఉదయం 11 గంటలకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

కర్రల లారీకి తప్పిన పెను ప్రమాదం

పాడేరు రూరల్, జూలై 23: మన్యం నుంచి మైదాన ప్రాంతానికి కర్రలను తరలిస్తున్న లారీకి సోమవారం అర్ధ రాత్రి పాడేరు ఘాట్‌లో పెను ప్రమాదం తప్పింది. పాడేరు నుంచి వెళ్తున్న లారీ కర్రలను కట్టిన కట్లు తెగిపోవడంతో ఏసు ప్రభు మలుపు దాటిన తరువాత అదుపు తప్పి కొండను ఢీకొట్టింది. అదే లారీ కుడి పైపుకు వెళ్లినట్లయితే లోయలోకి పడి ఘోర ప్రమాదం జరిగి ఉండేది పలువురు తెలిపారు.

అగ్గి తెగులు నివారణ చర్యలు చేపట్టాలి

గూడెంకొత్తవీధి, జూలై 23: వరి పొలాల్లో అగ్గి తెగులు వ్యాప్తి చెందకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో మధుసూదనరావు తెలిపారు. జర్రెల పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం పర్యటించి వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల వల్ల వరి పొలాల్లో అగ్గి తెగులు ఆశించే ప్రమాదం ఉందన్నారు. దీన్ని సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. నారు మడులు సిద్ధం చేసుకున్న రైతులు రెండు రోజులు ఆలస్యంగా నాట్లు వేసుకోవాలని, పొలాల్లో నిల్వ నీటిని తొలగించుకోవాలని ఆయన సూచించారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అధిక నిధుల కేటాయింపుపై హర్షం

అరకులోయ, జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అధిక నిధులు కేటాయించడంపై పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, మాదల సర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు ఎల్‌బీ.బీమరాజు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం విలేకరులతో వారు మాట్లాడుతూ బడ్జెట్‌లో ఏపీ రాజధానికి రూ.15 వేల కోట్లు కేటాయించడం ఆనందకరమన్నారు. ఏపీకి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం హర్షణీయమన్నారు. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి సాధిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

సీజనల్ వ్యాధులతో తస్మాత్ జాగ్రత్త

డుంబ్రిగుడ, జూలై 23: సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలని డుంబ్రిగుడ వైద్యాధికారి రాంబాబు సూచించారు. వర్షాల నేపథ్యంలో దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్, పచ్చకామర్లపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అతని వెంట వైద్య సిబ్బంది శౌరి, రవీంద్ర, స్వామి, ప్రభాకర్, సంజీవ్, గురు ఉన్నారు.

కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్‌కు పక్కా ప్రణాళిక అవసరం

» మత్స్యకారుల మనుగడకు ముప్పు లేకుండా చర్యలు చేపట్టాలి
» పరిశ్రమలు, టూరిజం ప్రాజెక్టుల్లోనూ 75 శాతం స్థానికులకే ఉపాధి అవకాశాలు ఇవ్వాలి
» ప్రజాభిప్రాయ సేకరణలో పలువురు వక్తల అభిప్రాయం


మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టబోయే కోస్టల్ మేనేజ్‌మెంట్ ప్రణాళికలో భాగంగా తీర ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు తాము వ్యతిరేకం కాదని, అయితే ఆయా ప్రాంతాల్లోని మత్స్యకారుల జీవనానికి ముప్పు కలిగేలా ప్రణాళిక అమలు చేయవద్దని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. కోస్టల్ మేనేజ్‌మెంట్ ప్రణాళికలో భాగంగా ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేయబోయే పరిశ్రమలు, వివిధ టూరిజం శాఖల అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానికులకే 75 శాతం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్రణాళిక అమలు కోసం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు కలెక్టర్ విజయకృష్ణన్ అధ్యక్షత వహించారు. జిల్లాలో తీర ప్రాంత గ్రామాల నుంచి 120 మంది వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ముందుగా 2019 కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్రణాళికకు సంబంధించిన నోటిఫికేషన్ గురించి ప్రతినిధులకు అధికారులు వివరించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తీర ప్రాంతాల్లో టూరిజం, జీవనోపాధి, జీవశాస్త్రపరంగా చురుకైన మడ్ పాట్లు, కొత్త పరిశ్రమల ఏర్పాటు, ఓడరేవుల అభివృద్ధిపై ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా హాజరైన ప్రతినిధులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కె.లోకనాథం మాట్లాడుతూ తీర ప్రాంతాల నుంచి మత్స్యకారులను బయటకు పంపే ప్రయత్నాలు చేయరాదని సూచించారు. ఇప్పటికే ఎస్ఈజెడ్, ఎన్‌వోబీ వంటి కంపెనీల వల్ల సముద్రం డంపింగ్ యార్డులా తయారైందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ ఆయా గ్రామాల్లో పెట్టాల్సి వుంటే నాలుగు గోడల మధ్య నిర్వహించడాన్ని ఆయన తప్పుబట్టారు.

అభివృద్ధి పనులు చేపడితే అభ్యంతరం లేదని, అయితే సముద్రంపై ఆధారపడి జీవనం సాగించే మత్స్యకారుల మనుగడకు ముప్పు వాటిల్లే విధంగా చర్యలు లేకుండా చూడాలని కోరారు.

నక్కపల్లి మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నేత కొప్పిశెట్టి వెంకటేశ్ మాట్లాడుతూ తీర ప్రాంతాల అభివృద్ధి, కంపెనీల ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదన్నారు. స్థానికులకు ఆయా కంపెనీల్లో 75 శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. రాంబిల్లి మండలానికి చెందిన డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతకాయల శివాజీ మాట్లాడుతూ ఎస్ఈజెడ్, ఎన్ఓబీ వల్ల మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, మహిళా నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌కు వ్యతిరేకం కాదని, స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కాకుండా సముద్ర తీర ప్రాంత గ్రామాల ప్రజలకు పునరావాస చర్యలు చేపట్టిన తరువాత అభివృద్ధి పను లు చేపట్టాలని సూచించారు.

సదస్సులో ప్రతినిధుల అభిప్రాయాలను విన్న కలెక్టర్ విజయకృష్ణన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం కోస్టల్ మేనేజ్‌మెంట్ ప్రణాళిక ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనుందన్నారు.

ప్రజాభిప్రాయ సదస్సుకు హాజరైన ప్రతినిధులు ఇచ్చిన సూచనలు, సలహాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానన్నారు. సదస్సుకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, వైసీపీ నాయకుడు వీసం రామకృష్ణ, సీపీఐ జిల్లా కార్యదర్శులు బి.వెంకటరమణ, రాజాన దొరబాబు, సీపీఎం నక్కపల్లి మండల అధ్యక్షుడు ఎం.రాజేశ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, ఏపీ రైతు సంఘం అచ్యుతాపురం మండల అధ్యక్షుడు బుద్ద రంగారావు, తీర ప్రాంతాలకు చెందిన మహిళా సంఘాల నాయకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు.

క్రైం... crime news

యువకుడి ఆత్మహత్య


మృతుడు సాకేటి రాము

మాకవరపాలెం, జూలై 23: మండలంలో కొత్తపాలెం గ్రామంలో నివాసముంటున్న ఒక వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ. రామకృష్ణారావు తెలిపారు. మంగళవారం మృతుని భార్య సాకేటి అపర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌కు చెందిన సాకేటి రాము (35) 2012 సంవత్సరం నుంచి మండలంలోని కొత్తపాలెం గ్రామం శివారు రామరాజు మామిడి తోటలో పనిచేస్తున్నాడు. తర్వాత 2021లో ఎరకన్నపాలెం గ్రామంలో సన్నిబాబు మామిడి తోటలో కూలీ పనులు చేస్తున్నాడు. అయితే అతనికి కొత్తపాలెంలో ఉన్న సొంతింటికి వెళ్లిపోదామని తరచూ భార్యతో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో 22వ తేదీన సాయంత్రం ఆరు గంటలకు మామిడి తోటలో పని ముగించుకొని స్వగ్రామం వెళ్లిపోదామని గొడవచేయగా, కొత్తపాలెంలో ఉన్న సొంతింటికి వచ్చేశామని భార్య అపర్ణ తెలిపింది. అయితే 23వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు తోట యజమాని సన్నిబాబు ఫోన్ చేసి తోటలో ఉన్న షెడ్‌లో రాము ఉరివేసుకొని ఉన్నాడని తెలిపారు. అక్కడికి వెళ్లి చూసేసరికి నా భర్త రేకుల షెడ్డులో ఉరివేసుకొని చనిపోయి ఉన్నాడని తెలిపింది. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆశ కార్యకర్త మృతి

డుంబ్రిగుడ, జూలై 23: మండలంలోని అరకు-పాడేరు జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆశ కార్యకర్త మృతి చెందింది. నేరుడువలస గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త పాంగి తులమ్మ(48) రోడ్డు దాటుతుండగా అరకు వైపు నుంచి పాడేరు వైపు వెళుతున్న కారు బలంగా ఢీకొట్టింది. రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న ఆమెకు స్థానికులు సపర్యలు చేసినప్పటికీ మృతి చెందిందని బాధిత కుటుంబీకులు బోరుమన్నారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్థానికులు వెంబడించినా స్పీడుగా వెళ్లిపోయిందని స్థానికులు తెలిపారు. ఈ విషయంపై బాధిత కుటుంబీకులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉపాధి పనుల్లో అక్రమాలు

» గొర్లివానిపాలెం, పెదముషిడివాడ పంచాయతీల్లో అవకతవకలు జరిగినట్టు నిర్ధారణ


ప్రజావేదికలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సందీప్

పరవాడ, జూలై 23: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగాయని, తక్షణమే విచారణ చేపట్టాలని గొర్లివానిపాలెం, పెదముషిడివాడ పంచాయతీల నాయకులు డిమాండ్ చేశారు. 2023 ఏప్రిల్ ఒకటి నుంచి 2024 మార్చి 31 వరకు చేపట్టిన ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఆడిట్‌కు సంబంధించిన విషయాలను తెలియపరిచేందుకు మంగళవారం పరవాడ మరిడిమాంబ కల్యాణ మండపంలో సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌డీఏ పీడీ సందీప్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆడిటర్లు మాట్లాడుతూ.. పెదముషిడివాడ, గొర్లివానిపాలెం పంచాయతీల్లో అవకతవకలు జరిగినట్టు వెల్లడించారు. తక్కువ మంది కూలీలతో పనులు చేయించి ఎక్కువ మందికి డబ్బులు చెల్లించినట్టు ఆడిట్‌లో గుర్తించారు. అలాగే ఒకరి పేరుకు బదులు మరొకరితో పనులు కూడా చేయించారు. జాబ్‌కార్డులు లేనప్పటికీ బయట వ్యక్తులతో పనులు చేయించారని పేర్కొన్నారు. దీనిపై మాజీ సర్పంచ్ గొర్లి కనకారావు, బంధం వెంకటరమణ తదితరులు మాట్లాడుతూ తక్కువ మంది కూలీలతో పనులు చేయించి ఎక్కువ మంది కూలీలకు డబ్బులు ఎలా చెల్లిస్తారని ప్రశ్నించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి, ఫీల్డ్ అసిస్టెంట్లతో పాటు వీరి వెనుక ఉన్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. విచారణ సమయంలో డీఆర్‌డీఏ పీడీ నిష్పక్షపాతంగా వ్యవహరించకపోతే ఆయనపై కూడా ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. గొర్లివానిపాలెం పంచాయతీలో 85 కొబ్బరి మొక్కలు నాటినట్టు రికార్డుల్లో పొందుపరిచారని, కానీ మూడు మొక్కలు మాత్రమే ఉన్నాయని మాజీ సర్పంచ్ గొర్లి కనకారావు ప్రస్తావించారు. మొక్కలకు సంబంధించిన లెక్కలు కూడా తేల్చాలని డిమాండ్ చేశారు. 2023 ఏప్రిల్ ఒకటి నుంచి 2024 మార్చి 31 వరకు మండల వ్యాప్తంగా రూ.6 కోట్ల 38 లక్షలతో పనులు చేపట్టినట్టు ఎంపీడీవో కీర్తి స్పందన వెల్లడించారు. వీటిలో కూలీలకు రూ.5 కోట్ల 27 లక్షలు చెల్లించామని, మిగతా రూ.కోటి 11 లక్షలు మెటీరియల్‌కు చెల్లించినట్టు చెప్పారు. పెదముషిడివాడ, గొర్లివానిపాలెం పంచాయతీల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేపడతామని పీడీ సందీప్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి, ఏపీడీ వెంకటరమణ, జిల్లా విజిలెన్స్ అధికారిణి నిర్మలాదేవి, ఎస్ఆర్‌పీ నాగరాజు, ఏపీవో గోవిందరావు పాల్గొన్నారు.

పెన్సిల్ ముల్లుపై అద్భుత కళాకృతులు

» ఇండియా బుక్ ఆఫ్ రికార్డు -2024లో ఖ్యాతిశ్రీకి స్థానం



ఇండియా బుక్ ఆఫ్ రికార్డుతో ఖ్యాతిశ్రీ

తుమ్మపాల, జూలై 23 : అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామానికి చెందిన కొణతాల ఖ్యాతిశ్రీ పెన్సిల్ ముల్లుపై పలు కళాకృతులను చెక్కి ఇండియా బుక్ ఆఫ్ రికార్డు -2024లో స్థానం సంపాదించింది. పెన్సిల్ ముల్లుపై జాతీయజెండా, హిందూ దేవతల పేర్లు, పలువురి పేర్లను చెక్కి తన ప్రతిభను చాటింది. ఖ్యాతిశ్రీ తండ్రి శివాజీ సామిల్లును నిర్వహిస్తుండగా, తల్లి జ్యోతి శ్రావణి గృహిణి. ఖ్యాతిశ్రీ ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఎన్‌డీఏకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా ఖ్యాతిశ్రీ ప్రతిభను పలువురు ప్రశంసిస్తున్నారు.

సబ్బవరం స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ


డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ రమణతో మాట్లాడుతున్న ఎస్పీ దీపిక

సబ్బవరం, జూలై 23: సబ్బవరం పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ దీపిక మంగళవారం ఆకస్మి కంగా తనిఖీ చేశారు. సీజ్ చేసిన వాహనా లను పరిశీలించి, వాటి వివరాలను వాహనాలకు ట్యాగ్ చేయాలని సూచించారు. రికార్డులు పరిశీలించి తరచూ నమోదవుతున్న నేరాలు, రౌడీ షీటర్ల వివరాలు, గతంలో స్టేషన్ పరిధిలో నమోదైన గంజాయి కేసుల సీడీ ఫైల్స్, తీవ్రమైన కేసుల సీడీ ఫైల్స్‌ను పరిశీలించారు. ఆయా కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందితో మాట్లాడుతూ స్టేషన్ రిసెప్షన్ పుస్తకం నిర్వహించాలని, ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలని సూచించారు. రౌడీ షీటర్లపై దృష్టి సారించాలన్నారు. గంజాయి రవాణాపై దృష్టి పెట్టి, కారకులైన వారిని గుర్తించి అరెస్టు చేయాలని ఆదేశించారు. నేరాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. ఆమె వెంట పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ పిన్నింటి రమణ, సిబ్బంది ఉన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	92.00
లైవ్ ధర	112.00
విత్ స్కిన్	194.00
స్కిన్ లెస్	204.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి

» వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ అధికారిణి డాక్టర్ లూసి కార్డిలియా


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ అధికారిణి డాక్టర్ లూసి కార్డిలియా

పరవాడ, జూలై 23: వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేస్తూ ప్రజల మన్ననలను పొందాలని వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ అధికారిణి డాక్టర్ లూసి కార్డిలియా సూచించారు. పరవాడ పీహెచ్‌సీ పరిధిలో గల వెన్నెలపాలెం హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను మంగళవారం ఆమె సందర్శించారు. గర్భిణుల నమోదు, వ్యాధి నిరోధక టీకాల అమలు, ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన, జననీ సురక్ష యోజన తదితర పథకాల ఆన్‌లైన్ విధానం ఎలా జరుగుతుందో పర్యవేక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మలేరియా, డయేరియా వ్యాధులు ప్రబలకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆమె వైద్యసిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణులు హారిక, జయశ్రీ కర్మిషా, డీపీహెచ్ ఎన్ నాగమణి, డీపీవో జగదీశ్, ఎస్‌వోఏ రామచంద్రరావు, డేటా మేనేజర్ వై.జనార్దనరావు, సీహెచ్‌వో సాయిరాం, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అధ్వాన దారిలో అవస్థల ప్రయాణం

» గోతులమయంగా అసకపల్లి-లంకెలపాలెం రోడ్డు
» వాహనచోదకులకు తప్పని ఇబ్బందులు

సబ్బవరం, జూలై 23: మండలంలోని అసకపల్లి నుంచి లంకెలపాలెం వెళ్లే రోడ్డు గోతులమయంగా తయారైంది. గత మూడేళ్లుగా వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు



ఎరుకునాయుడుపాలెం- లంకెలపాలెం మధ్య లంకెలపాలెం రోడ్డుపై గోతులు


అసకపల్లి- ఎరుకునాయుడుపాలెం మధ్య లంకెలపాలెం రోడ్డుపై గోతులు

రోడ్డు పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. అసకపల్లి-లంకెలపాలెం మధ్య ఉన్న ఎరుకునాయుడు పాలెం, పైడివాడ అగ్రహారం, పెదముషిడివాడ తదితర గ్రామాల వద్ద రోడ్డుపై భారీగా గోతులు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో వెళ్లాలంటే వాహనచోదకులు బెంబేలెత్తిపోతున్నారు. గత రెండేళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం వల్ల ఈ రోడ్డుకు ఈ దుస్థితి వచ్చిందని, ఇప్పటికైనా స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

గరిష్ఠ స్థాయికి కోనాం నీటి మట్టం

చీడికాడ, జూలై 23: మండలంలో కోనాం జలాశయం నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరుకుంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోజురోజుకూ నీటి మట్టం పెరుగుతోంది. జలాశయం గరిష్ఠ స్థాయి నీటి మట్టం 101.25 మీటర్లు కాగా మంగళవారం మధ్యాహ్నం నాటికి 99.25 మీటర్లకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 250 క్యూసెక్కులు కాగా, మెయిన్, దిగువ గేట్లు ద్వారా 150 క్యూసెక్కుల సాగునీరు వృథాగా పోతున్నది.


మెయిన్‌గేటు ద్వారా విడుదల చేస్తున్న సాగునీరు

పెద్ద చెరువులో నీటి నమూనాల సేకరణ

» వారంలోగా నివేదికలు వెల్లడిస్తామని పీసీబీ ఈఈ వెల్లడి
» ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


పెద్ద చెరువులో నీటి నమూనాలను సేకరిస్తున్న పీసీబీ, ఎన్ఐవో సిబ్బంది

పరవాడ, జూలై 23 : పరవాడ పెద్దచెరువును పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) అధికారులతో పాటు ఎన్ఐవో, మత్స్యశాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఫార్మా యాజమాన్యాలు వ్యర్థ జలాలను గుట్టు చప్పుడు కాకుండా చెరువులోకి విడిచిపెట్టడంతో అధిక సంఖ్యలో చేపలు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఇదే విషయమై 'మళ్లీ చేపలకు చేటు' శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి పీసీబీ, ఎన్ఐవో అధికారులు స్పందించారు. పీసీబీ ఈఈ పీవీ ముకుందరావు ఆదేశాల మేరకు పీసీబీ సీనియర్ శాస్త్రవేత్త వీరేంద్ర, ఎన్ఐవో శాస్త్రవేత్త రామకృష్ణ, మత్స్యశాఖ అధికారులతో కలిసి చెరువులోని నీటి నమూనాలను సేకరించారు. అలాగే చెరువులోకి ఎటువైపు నుంచి వ్యర్థ జలాలు కలుస్తున్నాయో ఆ ప్రాంతమంతటినీ పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో కూడా నీటి నమూనాలను సేకరించారు. వాటిని ల్యాబ్‌లో పరీక్షించి తుది నివేదికను వారంలోగా తెలియజేస్తామని పీసీబీ ఈఈ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

చెరువు కాదు.. పంట భూమే..



మాడుగుల రూరల్, జూలై 23 : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంట భూములు చెరువులను తలపిస్తున్నాయి. వీరవిల్లి అగ్రహారంలోని ఎరుకువాడ చెరువు నీరు పారి పంట భూములు చెరువులా మారింది. వర్షం తెరిపిచ్చి పంట భూముల్లో నీరు తగ్గితే తప్ప పంటలు సాగు చేసేందుకు అవకాశం లేదని రైతులు చెబుతున్నారు.

అధికారుల పర్యవేక్షణ లోపం.. విద్యార్థులకు శాపం

» జాజులపాలెం పాఠశాల టీచర్లు తరచూ విధులకు డుమ్మా
» తల్లిదండ్రుల ఆరోపణ


తరగతి గదిలో ఉన్న విద్యార్థులు

చీడికాడ, జూలై 23: మండలంలోని విద్యా శాఖాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు విధులకు డుమ్మా కొడుతున్నారు. మండలంలో కోనాం శివారు జాజులపాలెం ప్రభుత్వ పాఠశాలలో సుమారు 25 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. కానీ ఇక్కడ టీచర్లు తరచూ విధులకు డుమ్మా కొడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈనెల 20వ తేదీన ఇద్దరు ఉపాధ్యాయులు డుమ్మా కొట్టగా.. విద్యార్థులు మాత్రం ఉదయం నుంచి సాయంత్రం వరకూ పాఠశాలలో వేచి చూశారు. మంగళవారం ఉదయం 10 గంటల తరువాత పాఠశాలకు వెళ్లిన ఇద్దరు ఉపాధ్యాయులు మధ్యాహ్నం భోజనాలు అనంతరం 1.30 గంటల తరువాత వెళ్లిపోయారని తల్లిదండ్రులు తెలిపారు. మండలంలో ఇద్దరు ఎంఈవోలు ఉన్నప్పటికీ పర్యవేక్షణ లేకపోవడం వలన ఉపాధ్యాయులు తరచూ డుమ్మా కొడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. దీనిపై ఎంఈవో బొంజుబాబుని వివరణ కోరగా.. ఈనెల 20వ తేదీన భానుప్రసాద్ అనే ఉపాధ్యాయుడు సెలవు పెడుతున్నట్టు తనకు సమాచారం ఇచ్చారన్నారు. మంగళవారం మధ్యాహ్నం విధులకు నిర్వహించకుంటే విచారణ చేసి శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

'తాండవ'కు జలకళ


370 అడుగులకు చేరుకున్న తాండవ రిజర్వాయర్ నీటి మట్టం

నాతవరం జూలై 23: ఈ వర్షాలకు తాండవ జలాశయంలో నీటి నిల్వలు పెరగడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తాండవ గరిష్ఠ నీటి మట్టం 385 అడుగులు కాగా, ప్రస్తుతం 370 అడుగులకు చేరుకుంది. రిజర్వాయర్‌లోకి 400 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తున్నదని తాండవ డీఈఈ అనురాధ తెలిపారు. త్వరలో తాండవ ఆయకట్టు రైతులతో సమావేశం ఏర్పాటు చేసి, నీటిని ఎప్పుడు విడుదల చేయాలనే అంశంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

కనకదుర్గమ్మకు అర కిలో వెండి బహూకరణ


పలాస వాసిని సత్కరించిన దృశ్యం

అనకాపల్లి టౌన్, జూలై 23 : స్థానిక గవరపాలెం సతకంపట్టులోని కనకదుర్గమ్మ అమ్మవారికి పలాస వాసి పందిరి రామారావు మంగళవారం అర కిలో వెండి బహూకరించారు. ఆయనను ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎం నాయుడు, బుద్ద భూలోకనాయుడు దంపతులు పాల్గొన్నారు.

స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడిగా సుందరయ్య


వెదురుపర్తి సుందరయ్య

అనకాపల్లి టౌన్, జూలై 23: అనకాపల్లి జిల్లా స్వర్ణకారుల సంఘం అధ్యక్షునిగా పట్టణానికి చెందిన వెదురుపర్తి సుందరయ్య నియమితులయ్యారు. ఈ మేరకు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వేణు మాధవ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన నియామకం పట్ల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్లపల్లి రంగాచారి, పట్టణ విశ్వబ్రాహ్మణసంఘం సభ్యులు కోటిపల్లి శ్రీను, కొమ్మోజు మల్లిబాబు, ఏ. శ్రీను అభినందనలు తెలిపారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో శ్రీనివాసరావుకు బంగారు పతకం



బంగారు పతకంతో శ్రీనివాసరావు

అనకాపల్లి టౌన్, జూలై 23: మధ్యప్రదేశ్ ఇండోర్‌లో ఈ నెల 21 నుంచి 26 వరకు జరుగుతున్న జాతీయస్థాయి మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి హాజరైన అనకాపల్లికి చెందిన ఎం.శ్రీనివాసరావు బంగారు పతకం సాధించారని వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి బద్రినాథ్ తెలిపారు. శ్రీనివాసరావు 59 కిలోల విభాగంలో ప్రాతినిధ్యం వహించి డెడ్‌లిఫ్ట్‌లో 181 కిలోల బరువు ఎత్తి జాతీయస్థాయిలో రికార్డు సృష్టించడమే కాకుండా స్క్వాట్‌లో 145 కిలోలు, బెంచ్‌ప్రెస్‌లో 92.5 కిలోలు బరువు ఎత్తి ఓవరాల్‌గా బంగారుపతకం సాధించారని తెలిపారు. శ్రీనివాసరావును కోచ్ నానాజీని అభినందించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నీలా, కోశాధికారి అజయ్‌లు హర్షం వ్యక్తం చేశారు.